## ఐఐటీ ప్రవేశ పరీక్ష...

# నాటి ప్రత్యేకత ఏదీ?

*'ఈ ఏడాది ఏ తీరులో ఉంటుందో' అనే ఉత్కంఠ మధ్య ఐఐటీ ప్రవేశపరీక్ష జేఈఈ ఈ నెల 8న జరిగింది. మొత్తమ్మీద పరీక్ష సులువుగా ఉందనే వ్యాఖ్యలు వినిపించాయి. ఇది అనుకూల పరిణామమేనా? ఐఐటీ-జేఈఈ బోధనలో విశేష అనుభవమున్న డి. కృష్ణమూర్తి అభిప్రాయాలు చూద్దాం.*



గత ఏడాది విద్యార్థులపై ఒత్తిడి తగ్గించటానికి జేఈఈ పద్ధతిలో ఎన్నో మార్పులు చేశారు. కానీ దాని ప్రత్యేకతకూ, స్థాయికీ భంగం కలగనివ్వలేదు. మొత్తం ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉన్నా కూడా పరీక్ష స్థాయి, విలువ దిగజారకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో ఆ పరీక్ష అందరి ప్రశంసలనూ అందుకుంది.

కానీ మొన్న జరిగిన ఐఐటీ-జేఈఈ మాత్రం ఎంతో సులభంగా; దాదాపు ఏఐఈఈఈ, ఎంసెట్‌ల స్థాయిలో రూపొందింది. జేఈఈ చరిత్రలోనే అత్యంత సులువైన, conceptual values పడిపోయిన పరీక్షగా దీన్ని భావించవచ్చు. భావనలకు పెద్దపీట వేసే పరీక్ష కాస్తా జ్ఞాపకశక్తిని పరీక్షించేదానిలా మారిపోయింది. ఈ పరీక్ష తనకున్న ప్రత్యేకతను కోల్పోయి మిగతా అన్ని పరీక్షల్లాగానే రూపుదిద్దుకుంది. కఠోర దీక్షతో, రెండేళ్ళుగా సిద్ధమైన విద్యార్థులకు ఈ పరీక్ష నిరాశనే మిగిల్చింది.

> **భావనలకు పెద్దపీట వేసే జేఈఈ ఇప్పుడు జ్ఞాపకశక్తిని పరీక్షించేదానిలా మారిపోయింది. ఈ పరీక్ష తనకున్న ప్రత్యేకతను కోల్పోయింది. కఠోర దీక్షతో, రెండేళ్ళుగా సిద్ధమైన విద్యార్థులకు నిరాశనే మిగిల్చింది.**

ఒకే స్థాయి, ఒకే పద్ధతిలో అసలు రెండు పరీక్షలు ఎందుకో అర్థం కావటం లేదు. రెండు పేపర్లలోనూ అన్ని సబ్జెక్టుల్లోనూ 75 శాతం సాధారణ స్థాయి ప్రశ్నలే. విద్యార్థి అవగాహన, విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షించే ప్రశ్నలు బహు తక్కువ. జేఈఈ విశిష్ట లక్షణానికి విరుద్ధంగా ఎన్నో ప్రశ్నలను ప్రామాణిక పుస్తకాల నుంచి యథాతథంగా సేకరించారు!

ఒకటి కంటే ఎక్కువ సమాధానాలు ఉండే బహుళైచ్ఛిక ప్రశ్నలనూ; విద్యార్థి భావ విశ్లేషణ సామర్థ్యాన్నీ, కచ్చితత్వాన్నీ పరీక్షించే Numerical questions నూ తొలగించారు. మూడు గంటల వ్యవధిలో 66 ప్రశ్నలను మాత్రమే సాధించమనడం- సగటు విద్యార్థికీ, ప్రతిభావంతుడైన విద్యార్థికీ భేదం లేకుండా చేయటమే!

జేఈఈ స్థాయికి ఏ మాత్రం సరిపోని అత్యంత పేలవమైన కొన్ని ప్రశ్నలను గణిత విభాగంలో అడిగారు. వీటిలో కొన్ని పదో తరగతి విద్యార్థి కూడా సమాధానం రాసేలా ఉన్నాయి. ఇలాంటి ప్రశ్నలు మిగిలిన సబ్జెక్టుల్లో కూడా ఉన్నాయి.

ఈ తరహా పరీక్షలో ఒక్క మార్కు తేడాతో వంద ర్యాంకులు అటు ఇటయ్యే అవకాశం ఉంటుంది. అందుకని ప్రతిభ గల విద్యార్థికీ, ప్రతిభ లేని విద్యార్థికీ తేడా గుర్తించడం సాధ్యం కాదు. పరీక్ష ఈ స్థితికి దిగజారడానికి కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కారకులే. పరీక్ష స్థాయికి తమ పిల్లలు ఎదగాలని కోరుకోవాలే కానీ పిల్లల స్థాయికి పరీక్షను దించమనడం భావ్యం కాదు.

ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ స్థాయిని- విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించాలనే సాకుతో ఇలా దిగజార్చడం ఏ విద్యావేత్తలూ హర్షించరు. ఇదే పద్ధతి కొనసాగితే ఐఐటీల ప్రాముఖ్యం తగ్గిపోయే అవకాశముంది.